శంషాబాద్ డీసీపీ బాధ్యతల స్వీకరణ



శంషాబాద్, జూన్ 20 : శంషాబాద్ డీసీపీగా బి.రాజేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీసీపీగా పనిచేసిన నారాయణరెడ్డి వికారాబాద్ ఎస్పీగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నార్కోటిక్స్(ఎన్‌సీ) స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజేష్ బదిలీపై శంషాబాద్‌కు వచ్చారు. ఆయనకు ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో (సీఐ) బాల్‌రాజ్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

ఐఎన్ఐఎస్ఎస్ అర్హత పరీక్షలో..
సత్తాచాటిన కండక్టర్ కుమార్తె

- జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించిన షాద్‌నగర్‌కు చెందిన మౌనిక



పల్లాటి మౌనిక

షాద్‌నగర్ అర్బన్, జూన్ 20 : ఉన్నత ఆశయంతో చదువుపై ఆసక్తి, పట్టుదల ఉంటే ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిరూపించింది పల్లాటి మౌనిక. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) నిర్వహించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ సూపర్ స్పెషాలిటీ(ఐఎన్ఐఎస్ఎస్) అర్హత పరీక్షలో సత్తా చాటింది. ఆలిండియా స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించి, అంకాలజీ స్పెషలిస్టు కాబోతున్న ఆమె.. టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అభినందనలు అందుకుంది. కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన పల్లాటి మహాలింగం షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. షాద్‌నగర్‌లోనే నివాసముంటూ తన ముగ్గురు కుమార్తెలను చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె మౌనిక షాద్‌నగర్‌లోని శ్రీవాణి పాఠశాలలో 5వ తరగతి వరకు, మాంటిస్సోరి పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో ఇంటర్ చదివి ఎంబీబీఎస్‌కు అర్హత సాధించింది. ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, ఢిల్లీలోని ఆలిండియా ఎయిమ్స్‌లో గత డిసెంబర్‌లోనే జనరల్ మెడిసిన్ పూర్తి చేసి, అదే ఆసుపత్రిలో పని చేస్తోంది. సూపర్ స్పెషాలిటీ చేయాలన్న ఆకాంక్షతో ఐఎన్ఐఎస్ఎస్ అర్హత పరీక్ష రాసి, ఆలిండియాలో రెండవ ర్యాంక్‌ను సాధించి శభాష్ అనిపించుకుంది. వారం రోజుల క్రితమే ఫలితాలు రాగా.. మౌనిక ప్రతిభను గుర్తించిన టీజీఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ గురువారం ట్విట్టర్‌లో ఆమెను అభినందిస్తూ పోస్టు చేశారు. కాగా, తమ కుమార్తె ఆలిండియాలో రెండవ ర్యాంక్ సాధించి అంకాలజీ స్పెషలిస్టు కాబోతున్నందున ఎంతో సంతోషంగా ఉందని మౌనిక తల్లిదండ్రులు సరిత-మహాలింగం తెలిపారు.




సంపత్ రాహుల్ సంతోష్ రుషి తరుణ్

'ఐఐటీ కౌన్సెలింగ్'లో మెరిసిన గురుకుల విద్యార్థులు

- ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన స్టూడెంట్స్

మొయినాబాద్ రూరల్, జూన్ 20: ఐఐటీ మొదటి విడత కౌన్సెలింగ్‌లో చిలుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు పేరొందిన ఐఐటీల్లో సీట్లు సాధించారు. గురువారం నిర్వహించిన కౌన్సెలింగ్(మొదటి విడత)లో కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు సీట్లు సాధించారు. ఈమేరకు అధ్యాపకులకు కళాశాల ప్రధానాచార్యులు వై.సత్యనారాయణ అభినందనలు తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్‌లోనూ మరి కొందరు అడ్మిషన్లు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వి.సంపత్‌కుమార్ (ఎలక్ట్రికల్-ఐఐటీ రూర్కెలా), ఎస్.రాహుల్(ఏరోస్పేస్‌ఐఐటీ బాంబే), వి.రుషి(సివిల్ ఇంజనీర్- ఐఐటీ జార్ఖండ్), డి.సంతోష్(మెటీరియల్ సైన్స్ బిలాయ్), ఇ. అభిలాష్(మెటలర్జీ-ఐఐటీ దుర్గాపూర్), టి.తరుణ్(మెటీరియల్ సైన్స్-ఐఐటీ పాట్నా) ప్రముఖ ఐఐటీల్లో సీట్లు సాధించారు.

త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్న ప్రచారంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు అలర్టయ్యారు. మంత్రి పదవిని దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఒకరికే అమాత్య పదవి దక్కే అవకాశాలుండడంతో ఆ ఒక్కరు ఎవరన్న చర్చ జోరుగా సాగుతోంది. ఈ పదవి కోసం కాంగ్రెస్ నుంచి ప్రధానంగా ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ పోటీ పడుతుండగా, కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా అధికార పార్టీలో చేరి మంత్రి పదవి పొందాలన్న ఆలోచనతో పావులు కదుపుతున్నట్టు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డి టచ్‌లోకి వెళ్లినట్టు చర్చ జరుగుతోంది. ఈ పోటీలో మంత్రి పదవి పొందే లక్ ఎవరికి దక్కుతుందోనని అధికార పార్టీ కార్యకర్తలు, జిల్లా వాసులు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.



కిస్సా కుర్సీకా!

- మంత్రివర్గ విస్తరణలో ఒకరికే అవకాశం!
- రేస్‌లో మల్‌రెడ్డి, టీఆర్ఆర్, మహేందర్‌రెడ్డి
- అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో సీనియర్లు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలూ మంతనాలు సాగిస్తున్నట్టు ప్రచారం

అమాత్య పదవి దక్కేదెవరికో?

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు సీనియర్లు ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయని విషయం తెలిసిందే. రాష్ట్ర మంత్రివర్గంలో మరో ఆరుగురికి ఇంకా అవకాశం ఉంది. పార్లమెంట్ ఎన్నికల తరువాత మంత్రివర్గ విస్తరణ చేపడతామని అప్పట్లో కాంగ్రెస్ పెద్దలు ప్రకటించారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ఇపుడు మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు మొదలు పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ జరగనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని సీనియర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే యత్నంలో ఉన్నారు. గత మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరికి కూడా ఛాన్స్ దొరకలేదు. టీఆర్ఎస్ ప్రభుత్వంలో మాత్రం ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కరికైనా మంత్రివర్గంలో ఛాన్స్ లభించే అవకాశం ఉంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మొత్తం 14 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో కేవలం నాలుగు చోట్ల మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. వీరంతా గ్రామీణ ప్రాంత నియోజకవర్గాల నుంచే ఎన్నిక కావడం గమనార్హం. పెద్దగా పోటీ లేకపోవడంతో వికారాబాద్ నుంచి విజయం సాధించిన మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్‌కు మంత్రవర్గంలో ఛాన్స్ లభిస్తుందని భావించారు. అయితే ఆయన్ని స్పీకర్‌గా ఎన్నుకున్నారు. దీంతో ఇంకా ముగ్గురే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో మంత్రివర్గ విస్తరణలో ఇద్దరు రేస్‌లో ఉన్నారు. ఇందులో పరిగి నుంచి గెలుపొందిన వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం నుంచి గెలుపొందిన మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రివర్గంలో స్థానం ఆశిస్తున్నారు. వికారాబాద్ డీసీసీ చీఫ్ రామ్మోహన్‌రెడ్డి పరిగి నుంచి గెలుపొందారు. ఎన్నికలకు ముందు పార్టీని పటిష్టం చేసి వికారాబాద్ జిల్లాలో నాలుగు స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోవడంలో కీలకంగా పనిచేశారు. ఈ నేపథ్యంలో క్యాబినెట్ పదవి రేసులో ఆయనకు కొంత ప్లస్‌గా మారే అవకాశం ఉంది. కొందరు కాంగ్రెస్ పెద్దలతో తనకున్న పరిచయాల ద్వారా ఆయన మంత్రివర్గంలో బెర్త్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అలాగే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా తాను అందరికంటే సీనియర్ అయినందున అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి కూడా మంత్రివర్గంలో ఛాన్స్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో చేరిన సమయంలో మహేందర్‌రెడ్డికి కొందరు పార్టీ పెద్దలు మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చారని ఆయన వర్గీయులు చెబుతున్నారు. అయితే, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి పోటీచేసిన ఆయన సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఓడిపోవడం ఆయనకు మైనస్‌గా మారింది. ఈ సీటు గెలిచుంటే ఆయనకు మంత్రిపదవికి అవకాశాలు మెరుగయ్యేవి. కానీ ఇపుడు ఆయనకు పరిస్థితులు అంత అనుకూలంగా లేవు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బేరసారాలు!

మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు జరుగుతున్న నేపథ్యంలో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా పార్టీ ఫిరాయించనున్నట్లు విస్తృత ప్రచారం సాగుతోంది. నగర శివార్లలోని 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో మెజార్టీ ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు సీఎం రేవంత్‌రెడ్డికి టచ్‌లో ఉన్నారు. మరికొందరు నియోజకవర్గ అభివృద్ధి పేరుతో సీఎంను వ్యక్తిగతంగా కలిసిన విషయం తెలిసిందే. వీరంతా కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. అయితే, వీరిలో కొందరు మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. శివారు ప్రాంతాలకు చెందిన ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంత్రిపదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీలోకి వస్తామంటూ బేరసారాలు సాగిస్తున్నట్లు తెలిసింది. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితే వీరిలో ఇద్దరు, ముగ్గురిని మంత్రివర్గంలో తీసుకోవచ్చనే ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే నగర శివార్ల నుంచి ఒకరికి మంత్రివర్గంలో అవకాశం దొరుకుతుందని చెబుతున్నారు. ఇదిలా ఉంటే సామాజిక సమీకరణాలు కూడా చూడాల్సిన అవసరం ఉన్నందున మంత్రివర్గ విస్తరణలో ఎవరికి ఛాన్స్ దొరుకుతుందనే విషయంలో చివరి వరకు సస్పెన్స్ కొనసాగవచ్చని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు.

రెండేళ్లు దాటినా..

- ముందుకు సాగని తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం
- నిధులు సరిపోక మధ్యలోనే ఆగిపోయిన పనులు



నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనం

ఇబ్రహీంపట్నం, జూన్ 20: రెండేళ్లు దాటినా ఇబ్రహీంపట్నం తహసీల్దారు నూతన కార్యాలయ భవనం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. గతంలో నిజాం హయాంలో నిర్మించిన భవనంలో తహసీల్దారు కార్యాలయం కొనసాగింది. అయితే, అది శిథిలమై ప్రమాదకరంగా ఉండడంతో ఆ భవనాన్ని కూల్చి 2022 ఫిబ్రవరిలో నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. డీఎంఎఫ్ నిధులు రూ.1.25 కోట్లతో పనులు చేపట్టగా రెండు స్లాబులు పూర్తయి కొంతమేర గోడలు కూడా కట్టారు. అయితే, ఆ నిధులు సరిపోకపోవడంతో ఏడాది కాలంగా పనులు నిలిచిపోయాయి. ఈ భవన నిర్మాణం పూర్తవడానికి ఇంకా రూ.90 లక్షలు అవసరమని అంచనాతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం తహసీల్దారు కార్యాలయాన్ని తాత్కాలికంగా పక్కనే ఉన్న పంచాయతీరాజ్ అతిథి భవనంలోకి మార్చారు. ఈ భవనం ఇరుకుగా ఉన్నందున ఫైళ్లు నేలపైనే పెట్టాల్సి వస్తోంది. భూముల రిజిస్ట్రేషన్లు, వివిధ పనుల కోసం వచ్చేవారు ఆరు బయటే నిల్చోవాల్సి వస్తోంది. అదనంగా నిధులు విడుదలైతే తప్ప భవనం పనులు పూర్తయ్యే పరిస్థితి లేదు. భవన నిర్మాణం పూర్తి కావడానికి కావాల్సిన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిధుల మంజూరు కోసం వేచి చూస్తున్నం

భవన నిర్మాణానికి అదనపు నిధులు కావాల్సి ఉంది. ఆ నిధుల కోసం వేచి చూస్తున్నం. ఈ విషయంలో ఉన్నతాధికారులను కూడా సంప్రదిస్తున్నాం. త్వరలోనే భవన నిర్మాణ పనులు పూర్తి చేసి రెవెన్యూ అధికారులకు అప్పగిస్తాం.

- గుర్రం ఇంద్రసేనారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ

రోడ్డుపైనే నిల్చోవాల్సి వస్తోంది



నిర్మాణాలు ప్రారంభించి రెండేళ్లు దాటినా తహసీల్దార్ భవనాన్ని అందుబాటులోకి తేలేకపోతున్నారు. తహసీల్దారు కార్యాలయానికి పనుల కోసం వస్తే రోడ్డుపైనే నిల్చోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే రంగారెడ్డి చొరవ తీసుకొని వెంటనే నూతన భవనం పనులు పూర్తి చేయించాలి.

- నిట్టు దానయ్య, రైతు దండుమైలారం

ఆరోగ్యవంతమైన
సమాజ నిర్మాణం అందరి బాధ్యత

- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ



నులి పురుగు నివారణ మాత్రలు వేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, జూన్ 20 : ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్ర వేయించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంఘం లక్ష్మీబాయి బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యంపై ప్రాధాన్యం ఇస్తోందని, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తోందన్నారు. విద్యార్థులు చదువులో నైపుణ్యం, క్రీడల్లో ప్రతిభను చాటాలన్నారు. బాలికలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలికల రక్షణకు స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, స్కూల్‌లో సదుపాయాలు కల్పించి హాస్పిటళ్లను ఏర్పాటు చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. నులి పురుగుల వల్ల ఎదురయ్యే సమస్యల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులకు, టీచర్లకు సూచించారు. సంవత్సరంలో రెండు సార్లు ఈ మాత్రలు వేస్తారని, జిల్లాలో 1-19 వయస్సు గల చిన్నారులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్ని హాస్టళ్లు, గురుకులాలు, అంగన్వాడీల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఈ రోజు తప్పిన వారికి 27వ తేదీన కచ్చితంగా మాత్రలు వేయించాలని సూచించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని సూచించారు. సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్, ప్రిన్సిపాల్ రమణమ్మ, టీచర్లు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించిన గ్రామస్తులు

చెత్త డంపింగ్ యార్డు పనులు నిలిపివేయాలి

శంకర్‌పల్లి, జూన్ 20: గ్రామ సమీపంలో చెత్త డంపింగ్‌యార్డు పనులను నిలిపివేయాలని బయన్నగూడ వాసులు డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం గ్రామస్తులు బైఠాయించి నిరసన చేపట్టారు. గ్రామంలో చెత్త డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. చెత్తను కాల్చడంతో దుమ్ము, ధూళి చెలరేగడంతో పాటు పొగతో గ్రామస్తుల ఆరోగ్యం పాడవుతుందని వాపోయారు. మహాలింగపురం గ్రామానికి చెందిన చెత్తను తమ గ్రామంలో వేయడం ఏంటని ప్రశ్నించారు. ఇక్కడ చెత్త వేస్తే కుక్కల బెడద ఎక్కువై కాలి నడకన వచ్చేవారికి ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండల పంచాయతీ అధికారి గీత ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్తానని చెప్పడంతో వారు శాంతించారు. నర్సింహారెడ్డి, కాంతిరెడ్డి, మాణిక్‌రెడ్డి, బుచ్చయ్య, విఠలయ్య, మల్లారెడ్డి, ప్రశాంత్, ప్రకాష్, పాండురంగారెడ్డి, రజినీకాంత్, వెంకట్‌రెడ్డి, రాములు, బుచ్చయ్య, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే
క్రిమినల్ కేసులు తప్పవు



చేవెళ్ల: దుకాణంలో విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు

చేవెళ్ల/షాబాద్/మొయినాబాద్ రూరల్, జూన్ 20 : రైతులకు విత్తనాలను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే ఫర్టిలైజర్ దుకాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఏడీఏలు చంద్రశేఖర్, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని తిరుమల సీడ్స్, సాయినాథ్ సీడ్స్, మన గ్రోమోర్ సెంటర్లను తనిఖీ చేశారు. రికార్డులు, విత్తన స్టాక్‌ను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చేవెళ్ల ఏడీఏ రమాదేవి, ఏవో తులసి తదితరులున్నారు. అలాగే జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం ఏడీఏ చంద్రశేఖర్ షాబాద్, నాగరగూడలో ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాల తయారీ కంపెనీ, లాట్ నెంబర్, బ్యాచ్ నెంబర్, స్టాక్ రిజిస్టర్లను, ఎరువులను పరిశీలించారు. రైతులకు ఆశ చూపి నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ శివకుమార్, షాబాద్ మండల వ్యవసాయాధికారి వెంకటేశం, స్పెషల్ బ్రాంచ్ పోలీస్ అధికారులున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా ఎరువులను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని టాస్క్ ఫోర్స్ అధికారులు హెచ్చరించారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏడీఏ చంద్రశేఖర్, ఏడీ శివకుమార్, రవీందర్‌రెడ్డి ఏఎస్ఐ(స్పెషల్ బ్రాంచ్), జంగయ్య, రాఘమ్మ సిబ్బంది తదితరులున్నారు.



ఆర్ఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీలత

ఆర్టీసీ ఆర్ఎంగా శ్రీలత బాధ్యతల స్వీకరణ

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/చాదర్‌ఘాట్, జూన్ 20: ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్‌గా జె.శ్రీలత గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ రీజినల్ మేనేజర్‌గా పనిచేసిన శ్రీలత రంగారెడ్డి రీజియన్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ రీజినల్ మేనేజర్‌గా పనిచేసిన ఎ.శ్రీధర్ ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలోని మార్కెటింగ్ విభాగానికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. మూడు నెలలుగా ఖాళీగా ఉన్న ఈ పదవిలో శ్రీలత గురువారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతల స్వీకరణకు ముందు ఆమె హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తంనాయక్‌ను కలిశారు. ఆయన శ్రీలతను అభినందించారు. ఎంజీబీఎస్ సీఆర్ఎం బి.శ్రీనివాస్, ఈఈ రవీందర్‌సింగ్ తదితరులు శ్రీలతకు ఘన స్వాగతం పలికారు.

ఉద్యోగులకు ఆధార్ లింక్ తప్పని సరి

తాండూరు, జూన్ 20: ప్రభుత్వ ఉద్యోగులకు తప్పని సరిగా ఆధార్ లింకు చేయాల్సిందే అంటూ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరి అండ్ అకౌంట్స్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ నెలకి సబందించిన శాలరీ బిల్లుతో పాటు తమ ఉద్యోగులందరు ఆధార్ కార్డు నెంబర్లను నమోదు చేసినట్లు సంబంధిత డీడీవో అధికారి ధ్రువపత్రాలు జారీచేస్తే తప్ప జీతాలను ట్రెజరీ అధికారులు మంజూరు చేయడానికి వీలు లేదు. జిల్లా ట్రెజరి అధికారులకు, ఎస్టీవో, జేడీలకు రాష్ట్ర ఖజానాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కచ్చితంగా పోర్టల్‌లో ఆధార్ నంబరు నమోదు ఉంటే తప్ప జీతాలను చెల్లించడానికి వీలులేదని ఈ ఉత్తర్వుల సారాంశం. జూలై నెలలో చెల్లించే వేతనానికి సంబంధించి పంపించే జీతాల బిల్లుతో పాటు ఆయా శాఖల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఆధార్ నంబర్లతో కూడిన జాబితాను కూడా వెంట జతరపచాలని సూచించారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులకు ఉత్తర్వులు శాఖల వారీగా రానున్నాయి.



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

నులిపురుగుల రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలి

చేవెళ్ల, జూన్ 20 : ప్రతీ ఒక్కరు నులిపురుగుల రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలని, పిల్లల ఎదుగుదలకు నులిపురుగుల నివారణ మాత్రలు ఎంతో ఉపయోగపడుతాయని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యలు తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిధిలోని ఊరెళ్ల పరిధిలో గల మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు. వారు మాట్లాడుతూ ఏడాది పిల్లల నుంచి 19 ఏళ్ల లోపు వారికి అల్బెండజోల్ మాత్రలు విధిగా ఇవ్వాలని సూచించారు. నులిపురుగులతో రక్తహీనత, పోషకాహారం లోపం, ఆకలి మందగించడం, బలహీనత, కడుపులో నొప్పి, వికారం, వాంతులు, అతిసారం, బరువు తగ్గడం వంటి సమస్యలు వస్తాయన్నారు. మాజీ ఎమ్మెల్యే రత్నం, డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్, వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ ప్రధానోపాధ్యాయుడు మాకొద్దు

- విద్యార్థుల తల్లిదండ్రులు
- మల్కాపూర్ హెచ్‌ఎంపై విద్యాశాఖ అధికారుల ఫిర్యాదు

తాండూరు రూరల్, జూన్ 20: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు మాకొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మాజీ సర్పంచ్ ఎస్.విజయలక్ష్మితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యనాథ్ సీనియర్ ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నారు. ఇటీవల పదోన్నతి రావడంతో వైద్యనాథ్ అదే పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా వారం రోజుల కిందట బాధ్యతలు చేపట్టారు. అయితే ఆ పాఠశాలలో గతేడాది 331 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం 290మంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం 14మంది ఉపాధ్యాయులు పాఠశాలలో కొనసాగుతున్నారు. వీరిలో కూడా వివిధ కారణాలతో 7, 8వ తరగతులకు సంబంధించిన సుమారు 15మంది విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోయారు. అయితే విధి నిర్వహణలో నిర్లక్ష్యంతోపాటు పాఠశాలకు సంబంధించిన విషయాలపై ఎస్‌ఎంసీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని మాజీ సర్పంచ్ విజయలక్ష్మి గురువారం పాఠశాలకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడాపాఠశాలకు సంబంధించిన నిధుల విషయంలో కూడా అలసత్వం వహించారని ఆరోపించారు. పదోన్నతిపై హెచ్‌ఎంగా వచ్చిన వైద్యనాథ్‌ను వెంటనే పాఠశాల నుంచి బదిలీ చేయాలని కోరారు. ఈ విషయంపై డీఈవో, ఎంఈవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదరణ కమిటీ చైర్మన్ కుర్వ లక్ష్మి, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ అల్లావుద్దీన్, మాజీ ఉపసర్పంచ్‌లు అబ్దుల్ మజీద్, కాశీనాథ్, గ్రామస్తులు షైనుద్దీన్, మహేందర్‌రెడ్డి, కిష్టప్ప ఉన్నారు. ఈ విషయమై హెచ్‌ఎం వైద్యనాథ్‌ను వివరణ కోరగా మల్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గత ఆరు సంవత్సరాలుగా సీనియర్ ఉపాధ్యాయుడిగా ఉంటూ గత రెండు సంవత్సరాలుగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా పాఠశాలలో సేవలందిస్తున్నానని తెలిపారు. పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినప్పటికీ ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గడంతో తనను పాఠశాలలో కొనసాగవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారని అన్నారు. అమ్మ ఆదర్శకమిటీ ద్వారా వచ్చిన నిధులు రూ.3లక్షల 25వేలు మంజూరయ్యాయని, వాటితో పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించానన్నారు. ఇదే పాఠశాలకు గెజిటెడ్ హెచ్‌ఎంగా రావడంతో ఇక్కడే కొనసాగుతున్నారని అన్నారు. జరిగిన విషయాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల అభివృద్ధికి నిర్లక్ష్యం వహించకుండా పని చేస్తానని చెప్పారు. తనను ఇదే పాఠశాలలో కొనసాగించాలని హెచ్‌ఎం వైద్యనాథ్ గ్రామస్తులను కోరారు.



మల్కాపూర్‌లో హెచ్‌ఎం వైద్యనాథ్‌ను నిలదీస్తున్న మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు

నక్షబాట కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

షాబాద్, జూన్ 20 : మండల పరిధిలోని చందన్‌వెళ్లి నుంచి చందన్‌వెళ్లి చెరువు, అంతిరెడ్డిగూడ గ్రామం వరకు నక్షబాటను కబ్జాకు గురికాకుండా చూడాలని, బాటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని చందన్‌వెళ్లి గ్రామస్థులు గురువారం తహసీల్దార్ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. చందన్‌వెళ్లి నుంచి చందన్‌వెళ్లి చెరువు, మాచన్‌పల్లి వరకు పూర్వం నుంచి నక్షబాట ఉందని, టీఎస్‌ఐఐసీ కంపెనీ వారు రోడ్డును మూసివేసి కబ్జాచేస్తున్నారని తెలిపారు. వారం క్రితం తహసీల్దార్‌కు ఈ విషయమై వినతి పత్రం ఇచ్చినా స్పందించడంలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నక్షబాట కబ్జాకు గురికాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు చేవెళ్ల స్వామి, నర్సింహారావు, వేమారెడ్డి, అంజనేయులు, అనంతం, తదితరులున్నారు. కాగా, టీఎస్‌ఐఐసీ అధికారులతో చర్చించి గ్రామస్థులకు తగిన న్యాయం చేస్తామని తహసీల్దార్ అన్వర్ తెలిపారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న చందన్‌వెళ్లి గ్రామస్థులు

ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలి

కొత్తూర్, జూన్ 20: రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరుతూ స్థానిక ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డికి గురువారి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో బదిలీలు, పదోన్నతులు జరుగుతున్నా.. రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులకు మాత్రం ఎందుకు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాలకు చెందిన 10మండలాలు జిల్లాల పునర్విభజనలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో కలిసినందుకు బదిలీలు నిలిచిపోయావని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై తమ వంతు కృషి చేయాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్సీని వేడుకున్నారు. స్పందించిన ఎమ్మెల్సీ ఉపాధ్యాయులకు న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బదిలీపై వెళ్తున్న ఎస్పీ కోటిరెడ్డికి ఘనంగా వీడ్కోలు

- పూల వర్షం కురిపిస్తున్న పోలీసులు
- వికారాబాద్‌లో పని చేయడం గౌరవంగా ఉంది: ఎస్పీ

వికారాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డికి పోలీసు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. రెండున్నర సంవత్సరాలు జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించిన కోటిరెడ్డిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మేడ్చల్‌జోన్ డీసీపీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఎస్పీ కోటిరెడ్డి గురువారం తన విధుల నుంచి రిలీవ్ కాగా, జిల్లా పోలీసు కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది కవాతుతో ఇచ్చిన గౌరవ వందనాన్ని ఎస్పీ కోటిరెడ్డి స్వీకరించారు. అనంతరం ఆయన పోలీసు అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. వికారాబాద్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి చివరి రోజు వరకు జిల్లాలో ఎలాంటి శాంతి భద్రతల సమస్య ఉత్పన్నం కాకుండా విధులు నిర్వహించామన్నారు. జిల్లాలో హోంగార్డు అధికారి నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రతీఒక్కరు సమయస్ఫూర్తి, సమన్వయంతో పనిచేయడం వల్ల శాంతి భద్రతల పరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాలేవని చెప్పారు. జిల్లాలో పోలీసు అధికారులందరూ కలిసి ఒక టీం మాదిరిగా పనిచేశారన్నారు. తాను ఎక్కడకు వెళ్లినా వికారాబాద్ జిల్లాలో పని చేయడం తనకెంతో గౌరవంగా, ప్రత్యేకంగా ఉందని వ్యాఖ్యానించారు. పోలీసు శాఖకు సహకరించిన జిల్లా ప్రజలకు, ఇతర శాఖల అధికారులకు, మీడియాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దారి పొడవునా పూలవర్షంతో ఎస్పీకి నీరాజనం

జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయం నుంచి ఎన్నెపల్లి చౌరస్తా వరకు ప్రత్యేకంగా అలంకరించిన ఓపెన్ టాప్ వాహనంలో ఎస్పీ కోటిరెడ్డిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. దారిపొడవునా పోలీసు అధికారులు, సిబ్బంది ఎస్పీపై పూలవర్షం కురిపించి నీరాజనం పలికారు. ఎస్పీ సేవలను గుర్తుచేస్తూ ఎన్నేపల్లి చౌరస్తాలో ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ యు.రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, కరుణాసాగర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, వర్టికల్ డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేష్, జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



బదిలీపై వెళుతున్న ఎస్పీ కోటిరెడ్డిపై పూలవర్షం కురిపిస్తూ ఘనంగా వీడ్కోలు పలుకుతున్న పోలీసు అధికారులు

చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో..

పూడూరు: బదిలీపై వెళ్తున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డికి మండలంలోని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఘనవీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్‌తోపాటు సిబ్బంది ఎస్పీని ఘనంగా సన్మానించారు.

కల్వకుర్తిని స్టడీ హబ్‌గా మారుస్తాం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న కసిరెడ్డి

కడ్తాల్, జూన్ 20: కల్వకుర్తి నియోజకవర్గాన్ని స్టడీ హబ్‌గా మారుస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని అన్మాస్‌పల్లి సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్ ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు గురువారం కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, కడ్తాల తహసీల్దార్ ముంతాజ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, నాయకులతో కలిసి అనువైన ప్రభుత్వ స్థలాలను కసిరెడ్డి పరిశీలించారు. సర్వేనెంబర్లు 260, 321లలో గల భూముల్లో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశానుసారం ఆయా విద్యాసంస్థల ఏర్పాటుకు అనువైన స్థలాలను నియోజకవర్గంలోని కడ్తాల, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి వంద ఎకరాలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 20 ఎకరాలు, ఇతర ఉన్నత విద్యాలయాల ఏర్పాటుకు మరో 30 ఎకరాల ప్రభుత్వ భూముల సేకరణకు పరిశీలిస్తున్నట్లు వివరించారు. భూముల గుర్తింపు పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. తహసీల్దార్ లలిత, రంగారెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, తదితరులున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి

ఆమనగల్లు : భూ సమస్యలను సత్వరంగా పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. ధరణిలో పొరపాట్లను సరిదిద్ది రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండ చొరవ తీసుకోవాలన్నారు. ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయంలో భూ సమస్యలు, ప్రభుత్వ భూముల గుర్తింపుపై నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల, కల్వకుర్తి, వెల్దండ మండలాల తహసీల్దార్లతో ఆర్డీవో శ్రీను అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారిగా కార్యాలయానికి వచ్చిన కసిరెడ్డిని ఆయా మండలాల తహసీల్దార్లతో కలిసి ఆర్డీవో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పనిచేయాలని కోరారు. తహసీల్దార్లు లలిత, ముంతాజ్, రంగారెడ్డి, ఇబ్రహీం, రవికుమార్, సునీల్, తదితరులున్నారు.



విరాహత్ అలీ, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర బాధ్యులకు సన్మానం

వికారాబాద్/రంగారెడ్డి అర్బన్, జూన్ 20: నూతనంగా ఎన్నికైన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర బాధ్యులను ఆ సంఘం జిల్లా నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఖమ్మంలో జరిగిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభల్లో గురువారం ప్రకటించిన కొత్త కార్యవర్గంలో రాష్ట్ర అధ్యక్షుడిగా విరాహత్ అలీ, కార్యదర్శిగా శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పకీరప్ప హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కార్యవర్గంలో కీలకమైన రాష్ట్ర కార్యదర్శి, కోశాధికారి పదవులు దక్కేవిధంగా సహకరించిన సంఘం రాష్ట్ర, జాతీయ బాధ్యులకు వారు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

ఆరుద్రపైనే ఆశలు

- దోబూచులాడుతున్న రుతుపవనాలు
- నిరాశలో అన్నదాతలు

మేడ్చల్, జూన్ 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నైరుతి రుతుపవనాలు దోబూచులాడుతున్నాయి. మృగశిర కార్తెకంటే ముందే నైరుతి పలకరిస్తుందని వాతావరణశాఖ చెప్పడంతో వానాకాలం సాగుపై రైతులు ఆశపడ్డారు. రెండు రోజులు మురిపించిన వానలు ముఖం చాటేయడంతో నిరాశకు లోనవుతున్నారు. హైదరాబాద్‌లో రోజూ సాయంత్రం వర్షాలు కురుస్తున్నప్పటికీ నగరశివారు కూతవేటు దూరంలో ఉన్న మేడ్చల్ జిల్లాలో మాత్రం వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో జిల్లా రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ప్రధానంగా మెట్ట పంటలను రైతులు పూర్తిగా వర్షాధారంగానే సాగుచేస్తుంటారు. కొంతమంది నైరుతిరాకపై నమ్మకంతో మొక్కజొన్న విత్తుకున్నారు. ఇప్పుడు వర్షాలు లేకపోవడంతో మొలక రాక దిగాలు చెందుతున్నారు.

సాగని నారుమడులు

మే నుంచి వాతావరణ శాఖ ముందస్తుగా నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాలకు విస్తరిస్తాయని చెబుతూ వస్తోంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. సాధారణంగా మృగశిరకార్తెలో కురిసిన వర్షానికి మెట్ట పంట ప్రాంత రైతులు విత్తనాలు వేసుకుంటారు. ముఖ్యంగా మొక్కజొన్న, పత్తి, పెసర, కంది పైర్ల విత్తనాలు చల్లుకోవడం, విత్తుకోవడం చేస్తుంటారు. ఈసారి ఆ దిశగా పనులు సాగడం లేదు. బోరుబావుల కింద రైతులు ఆరుద్రలోనే నార్లు పోస్తుంటారు. ఎందుకంటే ప్రస్తుతం రైతులు 80శాతం మంది సన్నరకాల వరి వంగడాలు సాగు చేస్తున్నారు. అందులోనూ స్వల్పకాలిక వరివంగడాలు అంటే 120-125రోజుల కాల వ్యవధి ఉన్న పంటలు వేసుకుంటున్నారు. నవంబరు మొదటి వారంలో వానాకాలం కోతలు పూర్తయి యాసంగికి నార్లు పోసుకునేలా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నారు. అందుకు అనుగుణంగా మృగశిర, ఆరుద్రలో వర్షాలు పడితే బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరిగి నీటి లభ్యతతో విద్యుత్ మోటార్ల సాయంతో ముందస్తుగా నాట్లు వేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు మృగశిరలో సరైన వర్షం పడలేదు. సరైన సమయంలో వానలు కురవకపోవడంతో అన్ని పంటలపై ప్రభావం చూపుతోందని, ఇప్పటికే మొక్క జొన్న రైతులు వర్షాలు లేక మొలక రాక ఇబ్బంది పడుతున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇక ఆరుద్రలోనైనా సరిపడా వర్షాలు కురుస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నారుమడి సిద్ధం చేస్తున్న రైతు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- విద్యార్థులకు ప్రజాప్రతినిధులు, అధికారుల సూచన
- జోరుగా నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ



కొత్తూర్ : నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 20: చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటేనే సత్ఫలితాలను సాధిస్తూ భావి భారత పౌరులుగా ఎదుగుతారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం షాద్‌నగర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే అల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నారి బాలబాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదగడానికి తల్లిదండ్రులు, వైద్యసిబ్బంది కృషి చేయాలని కోరారు. తినే ఆహార పదార్థాలు, పారిశుధ్యంపై అవగాహనను కల్పించాలని సూచించారు. ఏడాది నుంచి 19 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు ప్రతీ ఏటా రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు విధిగా వేయాలని కోరారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరునెలలకోసారి భారత ప్రభుత్వం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నదని తెలిపారు. పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఎలిక పాములు, నులిపురుగులు, కొంకి పురుగుల నివారణ కోసం విధిగా ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని కోరారు. కౌన్సిలర్ పావని, కమిషనర్ వెంకన్న, ఎంఈవో శంకర్ రాథోడ్, హెచ్‌ఎం శివకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ జె.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : చదువుతోనే మనిషికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన చేస్తారని తెలిపారు. జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మాజీ సర్పంచ్ యాదమ్మ, ఎంఈవో శంకర్‌రాథోడ్ తదితరులున్నారు.

కొత్తూర్ : విద్య, వైద్యంతోనే మానవులు మనుగడ సాధించవచ్చని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భావి భారతపౌరులుగా ఎదిగే విద్యార్థుల కోసం ఆరోగ్యశాఖ మరిన్ని ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్య, వైద్య అభివృద్ధి కోసం అత్యధికంగా తన నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మండల పరిధిలోని పెంజర్ల ఉన్నత పాఠశాలలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ, చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కౌన్సిలర్లు నర్సింహగౌడ్, కోస్గి శ్రీనివాస్, సోమ్లానాయక్, చింతకింది చంద్రకళ, యాదయ్య, ఎంపీటీసీలు కృష్ణయ్య, రాజేందర్‌గౌడ్, డాక్టర్ హరికిషన్‌నాయక్, కమిషనర్ బాలాజీ, హెచ్‌ఎం అంగోర్‌నాయక్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకురుతుందని జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి సూచించారు. కేశంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఎంపీడీవో రవి చంద్రకుమార్‌రెడ్డి, వైద్యాధికారి నిఖిత, ఎంపీవో నర్సింహ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : 19 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు కొందుర్గు వైద్యాధికారి డాక్టర్ తబస్సుమ్, జీహెచ్‌ఎం వెంకట్‌రెడ్డిలు తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల, చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేయడం జరిగిందన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలో 96 శాతం విద్యార్థులకు మాత్రలు వేసినట్లు డాక్టర్ తబస్సుమ్ తెలిపారు. మాజీ సర్పంచ్ భూపాలచారి, వైద్యసిబ్బంది ప్రభులింగం, సరళ, ఉపాధ్యాయులు సత్యం, వెంకట్‌రావు, ఏఎన్‌ఎం అరుణ, ఆశా వర్కలు బేగం, మరియమ్మ, సువర్ణ, వెంకటేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : పిల్లలు ఆరోగ్యవంతులైతేనే అన్ని రంగాలలో రాణిస్తారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీపీ అనితవిజయ్, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, డీఎల్‌పీవో అరుణకుమారి, ఆర్డీవో శ్రీను, మెడికల్ ఆఫీసర్లు పరీక్షిత్ నరేంద్ర, నాగరాజులతో కలిసి జాతీయ నులిపురుగు నివారణ దిన కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులు, చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు వేశారు. కమిషనర్ వసంత, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ, ఎంఈవో సర్దార్‌నాయక్, హెచ్‌ఎం పాండు, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, నాయకులు ఆశాలు తదితరులున్నారు.



షాద్‌నగర్ అర్బన్: చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కడ్తాల్ : కడ్తాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్పీటీసీ దశరథ్ నాయక్, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబాలు హాజరై డాక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి విద్యార్థులకు మాత్రలు వేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నోడల్ అధికారి జంగయ్య, ఉపాధ్యాయులు ఆశాలున్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యురాలు కల్పన, సూపర్‌వైజర్ యాదమ్మ, రామచంద్రయ్య, మధు, హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిభట్ల : ఆదిభట్ల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పరమేశ్ విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఇబ్రహీంపట్నం సీడీపీవో జి.శాంతిశ్రీ అన్నారు. ఇబ్రహీంపట్నం అంగన్‌వాడీ కేంద్రం-5లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మాత్రలు ఉచితంగా అందిస్తారని చెప్పారు. వైద్యాధికారి డా.సరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పల్లవి, ఏఎన్‌ఎం మేరీ, అంగన్‌వాడీ టీచర్ బాలమణి పాల్గొన్నారు.

యాచారం : బాలల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయని ఎంపీపీ సుకన్యబాషా తెలిపారు. యాచారం ఉన్నత పాఠశాల, కేజీబీవీ హాస్టల్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, యాచారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, డా.రాజ్యలక్ష్మి, కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

కందుకూరు : ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ నులిసురుగుల నివారణ మాత్రలు వేయించాలని ఎంపీపీ మంద జ్యోతి, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని కోరారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాల, కందుకూరు ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రలు వేశారు. వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక, పాఠశాల ఇన్‌చార్జి భార్గవి, నాయకులు డీల్లీ శ్రీధర్, పాండుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

చేవెళ్ల : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఎంపీపీ. విజయలక్ష్మీరమణారెడ్డి నులిపురుగుల మాత్రలు వేశారు. వైద్యురాలు వేదరాణి, ప్రధానోపాధ్యాయుడు ఖాజాపాషా, బీజేపీ చేవెళ్ల మండల యువ నాయకుడు మల్గారి వైభవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

షాబాద్ : నులిపురుగులను నిర్మూలించి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని చందన్‌వెల్లి వైద్యాధికారిణి డాక్టర్ వరలక్ష్మి అన్నారు. చందన్‌వెల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీపీ నక్షత్రం జయవంత్, జడ్పీటీసీ శ్రీకాంత్‌లు అన్నారు. మండలంలోని చిలుకూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఎంపీడీవో సంధ్యారాణి, డాక్టర్ వాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ ప్రియాంక స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి యూనిఫాం పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్ గౌడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి నులిపురుగుల మాత్రలు వేసుకోవాలి

శంషాబాద్ రూరల్ : ప్రతి విద్యార్థి నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని జడ్పీటీసీ తన్వీరాజు పిలుపునిచ్చారు. కవ్వగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆమె మాత్రలు చేశారు. ఎంపీపీ జయమ్మశ్రీనివాస్ పెద్దతూప్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈవో రాంరెడ్డి, డా.దివ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : మాత్రలు పంపిణీ కార్యక్రమంలో సీడీపీవో శాంతిశ్రీ, తదితరులు



కడ్తాల : విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ దశరథ్ నాయక్

క్రైం కార్నర్

రెండు లారీలు ఢీ.. తప్పిన పెను ప్రమాదం

కొత్తూర్, జూన్ 20: మండల కేంద్రానికి సమీపంలో గల బైపాస్ రహదారిపై గురువారం రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఓ లారీ నుజ్జు నుజ్జయ్యింది. హైదరాబాద్ వైపు నుంచి పెంజర్ల వైపు వెళ్లేందుకు వచ్చిన ఓ లారీ జంక్షన్ వద్ద మళ్లేందుకు యత్నిస్తుండగా, వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. వెనుక వచ్చిన లారీ నుజ్జు నుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదాలకు గురైన లారీలను పక్కకు తప్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు.

ఇంట్లో చోరీ.. నగదు అపహరణ

చౌదరిగూడ, జూన్ 20: బీరువాలో దాచిన డబ్బును అపహరించిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం చోటుచేసుకుంది. గురువారం ఎస్సై సక్రం తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని జాకారం గ్రామానికి చెందిన కటికె ప్రకాశ్ ఈ నెల 17న బక్రీద్ సందర్భంగా తనకున్న గొర్రె పొట్టేళ్లను అదే గ్రామానికి చెందిన అశోక్‌తో కలిసి నగరంలోని మెహిదీపట్నంలో విక్రయించాడు. వాటిని విక్రయించగా వచ్చిన రూ.3లక్షల 80వేలను తీసుకొని ఇద్దరూ కలిసి 19వ తేదీన ఉదయం జాకారం గ్రామానికి చేరుకున్నారు. ప్రకాశ్ ఇంట్లో ఉన్న బీరువాలో డబ్బులు దాచిపెట్టాడు. పని నిమిత్తం బయటికి వెళ్లి బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటికి చేరుకుని పడుకున్నాడు. గురువారం ఉదయం 6గంటల సమయంలో బీరువాలో తలుపులు తెరిచి, బట్టలు చిందరవందరగా పడి ఉండటాన్ని చూసి డబ్బులు కనిపించడం లేదని లబోదిబోమన్నాడు. తనతో పాటు పొట్టేళ్ల విక్రయానికి వచ్చిన అశోక్‌పై అనుమానం ఉందని బాధితుడు ప్రకాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సక్రం తెలిపారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న సబితాఇంద్రారెడ్డి

'కల్యాణలక్ష్మి' లబ్ధిదారులకు తులం బంగారమూ ఇవ్వాలి

మహేశ్వరం, జూన్ 20 : కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమైందని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాలతో పాటు తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని 148మంది లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. సబితారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సరిగ్గా అమలు చేయడంలేదన్నారు. కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు ఇచ్చిన మాట ప్రకారం తులం బంగారంకూడా అందజేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వానికి పేదల పక్షాన విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. మహేశ్వరం ఎంపీపీ సునిత అంద్యానాయక్, పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శైలజారెడ్డి, ఎంపీటీసీలు సుదర్శన్‌యాదవ్, స్వప్నరవీందర్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

మహేశ్వరం, జూన్ 20 : మహేశ్వరం మోడల్ స్కూల్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన బోధన చేయుటకు ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హత, అనుభవం ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ధనుంజయ్ తెలిపారు. టీజీటీ(హిందీ,) పీజీటీ(మ్యాథ్స్), పీజీటీ(ఫిజిక్స్), పీజీటీ(ఇంగ్లీష్), పీజీటీ కామర్స్ సబ్జెక్టుల్లో ఖాళీలున్నాయని, పీజీ, బీఈడీ కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగలవారు దరఖాస్తులను 22వ తేదీలోగా కళాశాలలో సమర్పించాలని తెలిపారు. వివరాలకు 9849746567, 9603150011 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ ధనుంజయ్ సూచించారు.

కందుకూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి



విఠల్‌రెడ్డి, మహేంద్రకుమార్‌రెడ్డిలను సన్మానిస్తున్న అంజయ్య తదితరులు

కందుకూరు, జూన్ 20 : కందుకూరు గ్రామానికి చెందిన సురసాని విఠల్‌రెడ్డిని కందుకూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన క్లబ్ ప్రత్యేక సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. 18 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన కందుకూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవాకార్యక్రమాలను చేపట్టినట్లు గుర్తుచేశారు. అధ్యక్షుడిగా ఎస్.విఠల్‌రెడ్డి, కార్యదర్శిగా తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తను ఎన్నుకున్నట్లు చెప్పారు. క్లబ్ మాజీ అధ్యక్షులు బీఆర్.రాంరెడ్డి, తాళ్ల అంజయ్య, ఎస్.వెంకటరంగారెడ్డి, నిమ్మ అంజిరెడ్డి, వెంకటేశ్వర్‌గుప్త, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆమనగల్లు, జూన్ 20: నేడు(శుక్రవారం) ఆమనగల్లు మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. ఎంపీపీ అనిత అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావాలని, ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

కడ్తాల్, జూన్ 20: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సేవాలాల్ సేన రాష్ట్ర కన్వీనర్ భీంలాల్ పవార్, జిల్లా అధ్యక్షుడు నరేశ్ నాయక్, ప్రధాన కార్యదర్శి కొర్ర రాజు నాయక్‌లు కోరారు. జనాభా ప్రాతిపదికన పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల డిమాండ్ల పరిష్కారం కోసం గురువారం కలెక్టరేట్ ఎదుట సేవాలాల్ సేన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నరేశ్‌నాయక్ తెలిపారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేసినట్లు చెప్పారు. సంఘం నాయకులు కిషన్‌నాయక్, రవి నాయక్, లక్ష్మణ్ నాయక్, బాల్‌రామ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

సాంస్కృతిక సంస్థ మండల నూతన కమిటీ

షాబాద్, జూన్ 20 : శ్రీవాణి సాంస్కృతిక సంస్థ షాబాద్ మండలం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎల్.ఎన్. కన్నా మాస్టర్, జిల్లా కమిటీ కోకన్వీనర్ సురేష్ తెలిపారు. ఈమేరకు మండల గౌరవ అధ్యక్షుడిగా కమాల్‌రెడ్డి, సలహాదారులుగా లక్ష్మీనారాయణ, మల్లయ్య, కృష్ణయ్య, శ్రీనివాసాచారి, అధ్యక్షులుగా జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాంచంద్రయ్య, సత్యనారాయణ, మల్లయ్య, సత్యనారాయణ, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా మాణిక్యం, సహ కార్యదర్శులుగా నరేష్, సత్తయ్య, హనుమంతు, మహమ్మద్ హాజీ, విఠల్, కార్యనిర్వహణ కార్యదర్శులుగా విజయ్‌కుమార్‌రెడ్డి, గౌతం, జంగయ్య, గురుస్వామి, రమేష్, గౌరవ సభ్యులుగా గోపాల్‌రెడ్డి, పరమారెడ్డి, శ్రీశైలం, రాంచంద్రయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

వైద్య చికిత్సకు రూ.21 వేల ఆర్థికసాయం

తలకొండపల్లి, జూన్ 20: మండల కేంద్రానికి మిర్యాల శ్రీను తలకొండపల్లి మండల కేంద్రం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై వెల్దండ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తలకొండపల్లి జడ్పీటీసీ వెంకటేశ్ గురువారం శ్రీనును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్య ఖర్చులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.21వేలు సమకూర్చగా ట్రస్ట్ సభ్యులు నాగిళ్ల జగన్, బుచ్చిబాబు, మహేశ్‌లు అందజేశారు.

భారతీయ కిసాన్ సంఘ్ సహాయ కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రెడ్డి



కడ్తాల్, జూన్ 20: భారతీయ కిసాన్ సంఘ్ దిల్‌సుఖ్‌నగర్ బాగ్ సహాయ కార్యదర్శిగా కడ్తాల మండలం చల్లంపల్లి గ్రామానికి చెందిన చల్లా విష్ణువర్ధన్ రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు నగరంలో గురువారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీలో విష్ణువర్ధన్‌రెడ్డికి చోటు లభించింది. రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సహాయ కార్యదర్శిగా నియమితులైన ఆయన్ను పలువురు అభినందించి సత్కరించారు.

డాక్టర్ ఇమ్రాన్‌కు ఎమ్మెల్యే అభినందన



ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఇమ్రాన్

శంషాబాద్ రూరల్, జూన్ 20 : బాలల హక్కులు, కార్మికుల నిర్మూలనకు నిరంతరం కృషి చేస్తున్న డాక్టర్ ఇమ్రాన్‌ను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభినందించారు. నర్కూడ గ్రామానికి చెందిన ఇమ్రాన్ కొన్నేళ్లుగా బాలల హక్కుల పరిరక్షణ కోసం విశేష కృషి చేస్తున్నారు. ఈమేరకు గురువారం బీఆర్‌ఎస్ నేత నీరటి రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇమ్రాన్‌ను శాలువాతో సత్కరించారు. మున్ముందు మరింత సమాజ సేవ చేయాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టిన ఆయన చిన్న వయస్సులోనే ఏషియన్ ఇంటర్నేషన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ తీసుకోవడం అరుదైన గౌరవమని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు పలు సమస్యలపై ఇమ్రాన్ వినతిపత్రం అందజేశారు. శివాజీ, గౌస్‌అలీబేగ్ తదితరులున్నారు.

ఎరువుల డీలర్లు నిబంధనలు పాటించాలి

కడ్తాల్, జూన్ 20: ఎరువులు, విత్తన దుకాణాల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత సూచించారు. విక్రయించిన విత్తనాలకు సంబంధించి రైతులకు విధిగా రశీదులు ఇవ్వాలని అన్నారు. మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలను గురువారం ఏవో శ్రీలత తనిఖీ చేశారు. రికార్డులను, విత్తన, ఎరువుల నిల్వలను, గోదాంలను పరిశీలించారు. ఏఈవో అభినవ్, దుకాణాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

దాత చేయూత.. తాగునీటి సమస్యకు పరిష్కారం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 20: ఫరూఖ్‌నగర్ మండలంలోని శేరిగూడ గ్రామ పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చిన దాత మల్కయ్యగారి గోవర్ధన్‌రెడ్డిని గ్రామస్థులు అభిమానంతో సన్మానించారు. గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా తగ్గడం, తాగు నీటి బోర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య నెలకొంది. మధురాపురం గ్రామానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి మల్కయ్యగారి గోవర్ధన్‌రెడ్డి తన తండ్రి స్వర్గీయ రఘురాంరెడ్డి జ్ఞాపకార్థం రెండు బోర్లు వేయించారు. వాటిల్లో తగినంత నీరు రాకపోవడంతో మూడవ బోరు వేశారు. సమృద్ధిగా నీరురావడంతో పంపుసెట్టును బిగించి, పంచాయతీకి అప్పగించారు.



నీట్‌ను మళ్లీ నిర్వహించాలి



: షాద్‌నగర్ అర్బన్ : ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 20: నీట్ పరీక్షను రద్దు చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్య తీసుకోవాలని, పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గురువారం షాద్‌నగర్ చౌరస్తాలో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్.రాజు డిమాండ్ చేశారు. సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనునాయక్, ఈశ్వర్‌నాయక్, పద్మారెడ్డి, రాజశేఖర్, మహమ్మద్, భుజంగారెడ్డి, శేఖర్‌గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష అవకతవకలపై విచారణ జరిపించాలి

ఇబ్రహీంపట్నం : నీట్ పరీక్షలో అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సీఐటీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సామ్యేల్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్షలో అవకతవకలు జరగడంతో లక్షలాది మంది విద్యార్థులు అయోమయంలో ఉన్నారని, మోదీ ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపించాలన్నారు. అంతేగాకుండా పరీక్షను రద్దుచేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్, నాయకులు గణేష్, బుగ్గరాములు, జగన్, రమేష్, చరణ్, రాఘవేందర్ తదితరులున్నారు.



ఇబ్రహీంపట్నం : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

భువనేశ్వరికి బక్కని శుభాకాంక్షలు



భువనేశ్వరికి శుభాకాంక్షలు తెలుపుతున్న బక్కని నర్సింహులు



రామేశ్వరంలో పూజలు చేస్తున్న నాయకులు

షాద్‌నగర్ అర్బన్/షాద్‌నగర్ రూరల్, జూన్ 20: ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి అఖండ మెజార్టీని సాధించి అధికారంలోకి రావడానికి భువనేశ్వరి ఎంతో శ్రమించారని పేర్కొన్నారు. ఆమె జన్మదినం సందర్భంగా బక్కని నర్సింహులు భువనేశ్వరిని హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా భువనేశ్వరి జన్మదిన వేడుకలను షాద్‌నగర్ టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక గోత్ర నామాలతో పూజలు నిర్వహించగా నాయకులు గందం ఆనంద్, అనంతయ్య, వెంకటయ్యగౌడ్, కుమార్‌గౌడ్, అన్మారి వెంకటయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : చెంచులపై దాడులకు పాల్పడుతున్న వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు మండ్లి రాములు కోరారు. రాష్ట్రంలో చెంచులపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆందోళన చెందారు. దాడులు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాలు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో మొల్లచింతలపల్లి, భ్రమరాంబ కాలనీలో చెంచు మహిళ ఈశ్వరమ్మపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో గురువారం చెంచు నాయకులతో కలిసి రాములు నిరసన కార్యక్రమం నిర్వహించారు. దాడికి పాల్పడిన వెంకటస్వామి, శివుడుపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఈ సందర్భంగా వినతిపత్రం అందించారు.

యాచారం : సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో మా గోడు ఎవరికి చెప్పుకోవాలో తోచడం లేదదని బీజేవైఎం లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పగడాల శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఫీజు వసూళ్ల నియంత్రణపై ప్రభుత్వ పట్టించుకోకపోవడంతో ప్రైవేటు పాఠశాలల, కళాశాలల యజమానులు అడ్డగోలుగా ఫీజులు దండుకుంటున్నారని ఆందోళన చెందారు. ఇంజనీరింగ్ కళాశాలల యజమానులు బీటెక్, ఎంటెక్ పూర్తిచేసిన వారికి టీసీలు ఇవ్వకుండా వేధించడం దారుణమన్నారు. విద్యాశాఖలో జరుగుతున్న అన్యాయం, దోపిడీపై సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు.

కొత్తూర్ : మున్సిపాలిటీలోని గ్రామ దేవతల ఆలయాల నిర్మాణం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. పోచమ్మ దేవత ఆలయ గోపురం నిర్మాణం పనులను గురువారం స్థానిక నాయకులు ప్రారంభించారు. దాతల సహకారంతో మున్సిపాలిటీలోని 8 గ్రామ దేవత ఆలయ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. త్వరలో ఆలయాలను ప్రారంభిస్తామని నాయకులు తెలిపారు. ఎంపీటీసీ జంగగళ్ల కృష్ణయ్య, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బి. దేవేందర్‌యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్ మాదారం నర్సింహ్మాగౌడ్, కోస్గి శ్రీనివాస్, నాయకులు యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, శివచారి, బండి కృష్ణ, శ్రవణ్, విష్ణుచారి, వీరమోని శ్రీను, రాఘవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేయడానికి నేడు(శుక్రవారం) ఎమ్మెల్యే సబితారెడ్డి మండలానికి రానున్నట్లు బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చంద్రశేఖర్‌లు తెలిపారు. ఉదయం 10:30గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో చెక్కుల పంపిణీకి ఉంటుందన్నారు.

చౌదరిగూడ : ఆడ బిడ్డకు న్యాయం చేయాలని ముందుకు సాగుతునాన్నంటూ చెబుతున్న బీజేపీ నాయకుడు మచ్చ సుధాకర్‌రావు.. నీవు ముందుగా నిజాలు తెలుసుకొని మాట్లాడాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న రామస్వామిపై సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను ఆసరాగా చేసుకొని ఒక సామాజిక వర్గం మెప్పు పొందడానికి నీవు ఎంచుకున్నా మార్గం సరైంది కాదన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకొని ఒక ఆడ బిడ్డకు అన్యాయం జరిగితే ఆ ఆడ బిడ్డకు అండగా నిలబడి పోలీస్ శాఖ ద్వారా న్యాయం కోసం పోరాటం చేయడం తప్పు లేదన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మరుక్షణమే వారి వీడియోలు తీసి ఆడ బిడ్డలను రోడ్డుకు ఎక్కించినట్టు వీడియోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంలో నీ అంతర్య ఏమిటి చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీఎం రామస్వామి తప్పు చేసి చేసినట్లయితే పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. కేవలం సోషల్ మీడియాను వాడుకొని ఏపీఎం రామస్వామి పరువు ప్రతిష్ఠలను అభాసుపాలు చేస్తే ఖబర్దార్ మచ్చ సుధాకర్‌రావు, జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

కడ్తాల్ : విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీటీసీ పాలకుర్ల ఉమావతి బుగ్గయ్యగౌడ్ అన్నారు. ఎక్వాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల, దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్, పాఠశాల చైర్మన్ కౌసల్య, తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : ఫీజుల నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సి. మహేష్ అన్నారు. శంషాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా ఇంత వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో స్టేషనరీ స్కూల్ ఫీజులు అధికంగా వసూలుచేసి పేదల రక్తం తాగుతున్నారన్నారు. లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేసి పేదరికంలోకి నెట్టుతున్నారని, నింబంధనలు పాటించని స్కూల్ యాజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోటి, ప్రదీప్, రాజు, కిషోర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.